క్లుప్తంగా

తాడేపల్లి తహసీల్దార్‌కు అవార్డు



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి తహసీల్దార్ సీతారామయ్యకు ఎన్నికల సంఘం నుంచి అవార్డు లభించింది. శనివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన 15వ జాతీయ ఓటర్ల దినోత్సవంలో ఏపీ చీఫ్ సెక్రటరీ కె విజయేంద్ర చేతుల మీదుగా బెస్ట్ అసిస్టెంట్ ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్‌గా అవార్డును అందుకున్నారు. రెవెన్యూ సిబ్బంది అభినందనలు తెలిపారు.

ప్రజా సమస్యల సర్వే

ఫిరంగిపురం: కార్మిక సర్వే బృంద సభ్యులు బేతపూడిలోని చైతన్య నగర్, మాలదాసుల కాలనీ, గుండాల పాడులోని దాసుల కాలనీలో శనివారం ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, డ్రెయినేజీ, తాగునీటి సమస్యలు ప్రజలు వివరించారు. కొన్ని ఇళ్లకు ఇంత వరకు పట్టాలు ఇవ్వలేదని చెప్పారు. సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్తామని సర్వే బృంద సభ్యులు తెలిపారు. సీఐటీయూ మండల కార్యదర్శి మస్తాన్‌వలి ఉన్నారు.
జయలక్ష్మి సేవలు

అభినందనీయం



మంగళగిరి (తాడేపల్లిరూరల్): మంగళగిరి పట్టణ పరిధిలోని ఇందిరానగర్ యూపీహెచ్‌సీలో హెల్త్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న జయలక్ష్మి పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఆమెను శనివారం సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి పాల్గొని, మాట్లాడారు. వైద్య ఆరోగ్య శాఖలో జయలక్ష్మి ఏఎన్‌ఎంగా, హెల్త్ సూపర్‌వైజర్‌గా విశిష్ట సేవలు అందించి మన్ననలు పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ అన్నపూర్ణ, డీఐఓ డాక్టర్ శ్రావణ్‌బాబు, యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనూష పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరం ప్రారంభం

ఫిరంగిపురం: మండలంలోని 113 తాళ్లూరు, శిరంగిపాలెం గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు శనివారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఎం.రోశయ్య, చేవూరి.రామమోహన్‌రెడ్డి, అంచుల శంకరరావు ప్రారంభించారు. 70 పశువులకు పశు వైద్యాధికారి పీర్ అహ్మద్ పరీక్షలు చేసి, నట్టల నివారణ మందు వేశారు. శిరంగిపాలెంలో నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరంలో 40 దూడలకు నట్టల నివారణ మందును ఎల్ఎస్ఏ ఆర్వీ వినీల అందజేశారు. 15 గేదెలకు గర్భకోశ వ్యాధుల పరీక్షలు, 10 గేదెలకు చూడి పరీక్షలు చేసి మందులు అందజేసినట్లు తెలిపారు. 40 దూడలకు నట్టల నివారణ మందు వేసినట్లు ఆమె తెలిపారు.


డాన్ బాస్కోలో 28న జాబ్ మేళా

మంగళగిరి (తాడేపల్లిరూరల్) : ఈ నెల 28న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు దిశ డాన్ బాస్కో సేవా విభాగం నిర్వాహకుడు ఫాదర్ పి.జీవన్ శనివారం తెలిపారు. యర్రబాలెంలోని పాఠశాలలో విలేకరుల సమావేశం నిర్వహించారు. జాబ్ మేళాలో హీరో, హెట్రో, వరుణ్ మోటార్, అపోలో, మెడ్ ప్లస్, నెక్సన్ వంటి వివిధ రకాల 20 కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. 10వ తరగతి నుంచి పీజీ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులందరూ పాల్గొనవచ్చని చెప్పారు. నిర్వాహకులు సాగర్ రాజు, ఫాదర్ జి. చిన్నప్ప, ఫాదర్ పీ జోస్, ఫాదర్ ఎస్ మర్రెడ్డి, ఫాదర్ కేఏస్ జోసఫ్ పాల్గొన్నారు.

కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

తాడేపల్లిరూరల్ : ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని కార్మిక పోరాట కన్వీనర్ కూరపాటి స్టీవెన్ అన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షను శనివారం ఏఐఎఫ్‌టీయూ నాయకులు కె.ఆదినారాయణతో కలసి ఆయన ప్రారంభించారు. అక్రమ లాకౌట్ కారణంగా గత 32 సంవత్సరాలుగా అనేక ఆర్థిక, అనారోగ్య సమస్యలతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం కార్మికుల విషయంలో జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బి.అంకయ్య, ఆశీర్వాదం, దేవరాజు, ఎం.గురవయ్య, కోటేశ్వరరావు, దుర్గా భవాని, శారమ్మ, శివకుమారి పాల్గొన్నారు.

అవార్డుకు తాడికొండ సీఐ వాసు ఎంపిక



తాడికొండ: తాడికొండ సీఐ కె.వాసు పోలీసు అంత్రిక్ సురక్షా సేవా పథకం- 2022కు ఎంపికయ్యారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో చురుగ్గా పనిచేసిన వారికి అందజేసే ఈ అవార్డు సర్వీసులో సీఐ కె వాసు చూపించిన చొరవకు గాను ఉన్నతాధికారులు ఎంపిక చేశారు. ఈ మేరకు నేడు గణతంత్ర దినోత్సవంలో గుంటూరులోని పోలీస్ పేరేడ్ గ్రౌండ్‌లో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందుకోనున్నట్లు తెలిపారు.

కుక్కలు.. భౌబోయ్

- నియోజకవర్గంలో స్వైర విహారం
- గతేడాదిలో 4 వేలకుపైగా కుక్క కాటు బాధితులు
- బెంబేలెత్తుతున్న ప్రజలు
- ఆందోళనలో ద్విచక్ర వాహనదారులు
- ఆసుపత్రులకు పరిగెడుతున్న బాధితులు



మంగళగిరి ఊర్వశి థియేటర్ వద్ద కుక్కల గుంపు



మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ రోడ్డులో నులకపేట వద్ద పాతజాతీయ రహదారిపై కుక్కల గుంపు

తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల మండలాల్లో గ్రామ సింహాలు హడలెత్తిస్తున్నాయి. ఏమరపాటుగా ఉంటే పిల్లలపై దాడి చేస్తున్నట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు. నాలుగు రోజుల క్రితం మంగళగిరి పట్టణంలోని గౌతమబుద్ధ రోడ్డులో ఓ వ్యక్తి బైక్‌పై పిల్లల్ని ఎక్కించుకుని వెళ్తుండగా.. కుక్కలు వెంబడించాయి. దీంతో వాహనం అదుపుతప్పడంతో కిందపడి ద్విచక్రవాహనదారుడికి, ఒక బాలుడికి స్వల్ప గాయాలయ్యాయి. కుక్కల బెడదపై స్థానికులు ఎన్నోసార్లు అధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో ఆయా మండలాల అధికారులు ఓ ప్రైవేటు కంపెనీకి కాంట్రాక్ట్ అప్పగించి, కొన్ని కుక్కలకు కేవలం కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించి, వదిలివేశారు. దీంతో కొన్ని ప్రాంతాల్లో మళ్లీ గుంపులు గుంపులుగా చేరి సంచరిస్తున్నాయి. దీంతో పాదచారులకు, రాత్రిళ్లు ఇబ్బందికరంగా ఉంది. మంగళగిరి నగరంలో ఏ వీధిలో పరిశీలించినా వీధి కుక్కలు పదుల సంఖ్యలో ఉంటున్నాయి. గ్రామాల్లో అయితే కుక్కల్ని చూసి చిన్నారులు భీతిల్లుతున్నారు. కుక్కకాటుకు బాధితులు ప్రభుత్వ ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు.

గుంపులు గుంపులుగా చేరి

మండలాల్లో అధికారులు పాలకుల అనుమతి తీసుకుని వీధి కుక్కలను పట్టించి, ఊరికి దూరంగా వదిలిపెట్టాల్సి ఉంది. అయితే అనుమతుల విషయంలో కొన్ని ప్రాంతాల్లో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. దీనికితోడు పాలకులు కూడా ఈ విషయాన్ని పెద్దగా పట్టించుకోవడం లేదు. మంగళగిరి నగర పరిధిలో పాత మంగళగిరి, టిడ్కో గృహ సముదాయాలు, సీతారామ కోవెల సెంటర్, గౌతమబుద్ధ రోడ్డు తదితర ప్రాంతాల్లో కుక్కల బెడద చాలా ఎక్కువగా ఉంది. ఉదయాన్నే కాలనీ రోడ్లపై నడక సాగిస్తున్న వారిపై దాడులకు తెగబడుతున్నాయి.

ఆసుపత్రులకు పరుగులు

ఇటీవల ఒక్క రోజే పది మందికి పైగా వచ్చి యాంటీ రేబిస్ ఇంజక్షన్లు చేయించుకున్నారు. అధిక సంఖ్యలో పిల్లల్నే శునకాలు కాటువేస్తున్నాయి. వీటిలో పిచ్చి కుక్కలు ఉంటే మాత్రం ప్రమాదకరమని వైద్యులు అంటున్నారు.

4 వేల కుక్కకాటు కేసులు..

మంగళగిరి నియోజకవర్గ పరిధిలో మూడు మండలాల్లో కలిపి 9 యూపీహెచ్‌సీలు, 5 పీహెచ్‌సీలు, నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రికి ప్రతి రోజు ఒక్క కాటుకు గురైన వారు వస్తూనే ఉన్నారు. 2024 సంవత్సరంలో సుమారుగా 4 వేల మందికి పైగా కుక్క కాటుకు గురైనట్లు రికార్డులు చెబుతున్నాయి. రికార్డుల్లో లేని ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లే వారి సంఖ్య మరెంతో.

ఈ జాగ్రత్తలు పాటించాలి

కుక్కకాటుకు గురైన వారు ఖచ్చితంగా నాలుగు డోస్‌లు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. మొదటి రెండు డోస్‌లు ఖచ్చితంగా సమయానికి తీసుకోవడంతో పాటు మొదటి డోస్ తీసుకుని, రెండవ డోస్ సమయానికి తీసుకోకపోతే మళ్లీ మొదటి డోస్ నుంచి మొదలు పెట్టాల్సిందేనని అంటున్నారు. కుక్కకాటుకు గురైన తర్వాత మొదటి రోజు 1వ డోస్, మూడవ రోజు 2వ డోస్, 7వ రోజు మూడవ డోస్, 28వ రోజు 4వ డోస్ యాంటీ రేబిస్ వ్యాక్సిన్ తీసుకోవాలని స్పష్టం చేస్తున్నారు.

సమస్య ఎక్కువగా ఉంది



వీధి కుక్కల సమస్య మా ప్రాంతంలో ఎక్కువగా ఉంది. పని ముగించుకుని ఇంటికి వెళ్లే సరికి రాత్రి 12 గంటలు అవుతుంది. ఆ సమయంలో కుక్కలు వెంటపడుతున్నాయి. వీటిని పట్టుకెళ్లి ఎక్కడో దూరంగా వదిలేస్తే మంచిది.
– కోదండం, టిడ్కో గృహనివాసి, మంగళగిరి

చర్యలు చేపట్టాం



కుక్కల బెడద నివారణకు కార్పొరేషన్ అన్ని రకాల చర్యలను చేపట్టింది. కాజ గ్రామంలో ప్రత్యేక ఆసుపత్రి ఏర్పాటు చేసి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయిస్తున్నాం. పెంపుడు కుక్కలను యజమానులు రోడ్లపైకి వదలకుండా చూసుకోవాలి.
– అలీమ్ బాషా, కమిషనర్, ఎంటీఎంసీ

ఏఆర్‌వీ అందుబాటులో ఉంది



కుక్కకాటుకు గురైన వారు ప్రతిరోజు ఆసుపత్రికి వస్తున్నారు. బాధితులకు ఏఆర్‌వీ అందుబాటులో ఉంది. కుక్క కరిచిన వెంటనే నీటితో శుభ్రం చేస్తే చాలా వరకు ప్రమాదం తగ్గుతుంది. క్రమం తప్పకుండా వ్యాక్సిన్ వేయించుకోవాలి.
– స్నేహరాజ్, ప్రభుత్వ వైద్యాధికారిణి

బాలికల హక్కుల కల్పన కృషి ఎనలేనిది



కేవీఏఎస్ విజయలక్ష్మిని సన్మానిస్తున్న కళాశాల, కార్డ్ సంస్థ సభ్యులు

ఫిరంగిపురం: బాలికల హక్కుల కల్పనకు ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల కృషి ఎనలేనిదని జిల్లా మహిళా శిశు అభివృద్ధి సాధికారిత అధికారి కేవీఏఎస్ విజయలక్ష్మి అన్నారు. స్థానిక ఆర్‌సీజేసీ ప్రాంగణంలోని బీ ఫార్మసీ కాలాశాలలో జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విజయలక్ష్మి పాల్గొని, మాట్లాడారు. బాలికలు దైన్యాన్ని వదిలి ధైర్యంగా సమస్యలను ఎదిరించాలని పిలుపునిచ్చారు. ఏసమస్యను అయినా సమయస్ఫూర్తితో పరిష్కరించుకోవాలని చెప్పారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి సీహెచ్ విజయకుమార్ మాట్లాడుతూ బాలికా సంరక్షణ పథకాలు, హెల్ప్‌లైన్ నెంబర్ల సేవలను వివరించారు. కళాశాల నిర్వాహకులు విజయలక్ష్మిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో టి.దుర్గాభవాని, కార్డ్ సంస్థ డైరెక్టర్ కె.మేరి, బి.వాసంతి, ప్రిన్సిపల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అర్ధరాత్రిళ్లు తరలిపోతున్న ఇసుక



తాడికొండ మీదుగా అర్ధరాత్రి తరలిపోతున్న ఇసుక లారీ

తాడికొండ: తుళ్ళూరు మండలంలోని ఇసుక రీచ్‌ల నుంచి అర్ధరాత్రిళ్లు ఇసుక తరలిపోతోంది. రెవెన్యూ, పోలీసు, మైనింగ్ అధికారులు కనీస పర్యవేక్షణ కొరవడింది. ప్రభుత్వ పనుల కోసం అంటూ లింగాయపాలెం రీచ్‌లో ఉన్న ఇసుక స్టాక్ పాయింట్ నుంచి యథేచ్ఛగా ఇసుకను రాత్రిళ్లు లారీల్లో తరలించేస్తున్నారు. సంబంధిత అధికారులు ఇకనైనా స్పందించి అక్రమ ఇసుక రవాణాపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. తహసీల్దారు సుజాతను వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి రాలేదని, పగలు మాత్రం ప్రభుత్వ పనులకు వెలుగు ప్రాజెక్టు పర్యవేక్షణలో స్టాక్ పాయింట్‌లో ఉన్న ఇసుకను తరలిస్తున్నారని తెలిపారు. వెలుగు ఏపీఎం చిన వీరయ్యను వివరణ కోరగా తమ శాఖ పర్యవేక్షణలో ఇసుక తరలింపుపై ఎలాంటి ఆదేశాలు లేవన్నారు.

బైక్ ర్యాలీని జయప్రదం చేయండి

తాడేపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలపై నిర్వహించనున్న కార్మిక, కర్షక ట్రాక్టర్ బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్న శివశంకరరావు పిలుపునిచ్చారు. శనివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని మేకా అమరారెడ్డి భవన్‌లో ప్రజా సంఘాల నాయకులతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆదివారం ఉదయం 9 గంటలకు తాడేపల్లి పట్టణం సాయిబాబా గుడి వద్ద నుంచి కుంచనపల్లి గ్రామం వరకు ట్రాక్టర్, బైక్ ర్యాలీని నిర్వహించనున్నామని ఆయన తెలిపారు. ఈ ర్యాలీలో రైతులు, కౌలు రైతులు, కార్మికులు వ్యవసాయ కార్మికులు, ప్రజా సంఘాల నాయకులు అందరూ అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సీఐటీయూ నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, బూరగ వెంకటేశ్వరరావు, కొట్టే కరుణాకరరావు, ఆర్‌వీ రాఘవయ్య పాల్గొన్నారు.

కాలువ కట్టలమీద నిర్మాణాల తొలగింపు



ఇరిగేషన్ అధికారులు కూల్చివేసిన పశువుల పాక

తాడేపల్లిరూరల్: కాలువ కట్టలపై పేదలు వేసుకున్న నిర్మాణాలను కూల్చివేయడం అన్యాయమని వైఎస్సార్‌సీపీ నాయకుడు, బాధితుడు హరిబాబు గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని ఇప్పటంలో బకింగ్‌హామ్ కెనాల్ కట్టపై ఉన్న హరిబాబుకు చెందిన పశువుల పాకని ఇరిగేషన్ అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా హరిబాబు గౌడ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. మంత్రి నారా లోకేష్ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాలవగట్ల మీద నివాసముండే వారికి పట్టాలు ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. బకింగ్‌హామ్ కెనాల్ కట్టకు ఇరువైపులా భారీ కట్టడాలు ఉండగా ఎక్కడో మారుమూల ఇప్పటంలో రహదారి కూడా లేని మార్గంలో ఉన్న పశువుల పాకను ఇరిగేషన్ శాఖ అధికారులు కూల్చివేయడంపై విస్మయం వ్యక్తం చేశారు. గురువారం రాత్రి తాడేపల్లి తహసీల్దార్ సీతారామయ్యను కలిసి రెండు రోజులు అవకాశం ఇస్తే పాకను తొలగిస్తానని చెప్పినా వినకుండా నిర్మించుకున్న పాకను పూర్తిగా తొలగించారని వాపోయారు.

వేస్ట్ పికర్స్ స్థితిగతుల పరిశీలన



వేస్ట్ పికర్స్‌తో మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్ శకుంతల

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో రోడ్ల వెంబడి చిత్తు పేపర్లు, ప్లాస్టిక్ వస్తువులు సేకరించి జీవించే (వేస్ట్ పికర్స్ కమ్యూనిటీ) వారి జీవితాలు మెరుగుపరచాలని డీబీఆర్‌సీ ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. వారి విజ్ఞప్తి మేరకు శనివారం ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ శకుంతల వడ్డేశ్వరం విచ్చేసి వేస్ట్ పిక్కర్స్ కుటుంబాల పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. డీబీఆర్‌సీ కో–ఆర్డినేటర్ రాజశేఖర్ మాట్లాడుతూ ఇక్కడ నివసించే వారికి ఆధార్, రేషన్ కార్డులు లేవని, ఇళ్ల స్థలం, విద్యుత్, తాగునీటి సదుపాయాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని అడిషనల్ కమిషనర్‌ను కోరినట్లు తెలిపారు. కుటుంబాల పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించి, ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని అడిషన్ కమిషనర్ శకుంతల పేర్కొన్నారు.

ఏపీఎస్పీ కానిస్టేబుల్ ఆచూకీ లభ్యం

మంగళగిరి (తాడేపల్లిరూరల్): ఏపీఎస్పీ 6వ బెటాలియన్‌లో కానిస్టేబుల్ ఆచూకీ లభించింది. వివిధ వర్గాల నుంచి సేకరించిన వివరాల మేరకు.. దేగంటి వీర వెంకట సత్యన్నారాయణ, భార్య క్రాంతి జగన్మోహినితో మంగళగిరి నవులూరులో ఓ అద్దె ఇంట్లో ఉంటున్నాడు. గురువారం సాయంత్రం డీజీపీ ఆఫీస్‌లో విధి నిర్వహణకు వెళ్లిన సత్యన్నారాయణ రాత్రి ఇంటికి రాలేదు. అదనపు డ్యూటీ చేస్తున్నాడని భావించిన భార్య.. ఉదయం తన బాబుని స్కూల్ బస్సు ఎక్కించడానికి వచ్చిన సమయంలో.. ఇంటి సమీపంలో తన భర్త ద్విచక్ర వాహనం చూసింది. బైక్‌లో భర్త సెల్‌ఫోన్ ఉండటంతో ఆందోళన చెందింది. ఇంటికొచ్చి ఫోన్ చూడగా.. 'నన్ను క్షమించండి. నా భార్యను బాగా చూసుకోండి.. చెల్లి, బావ.' అంటూ సెల్ఫీ వీడియో కనిపించింది. దీతో శుక్రవారం సాయంత్రం మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో జగన్మోహిని ఫిర్యాదు చేసింది. ఎస్ వెంకట్ కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. ఈ సమయంలో ఓ హెడ్‌కానిస్టేబుల్ విజయవాడకు వెళ్లగా.. అక్కడ బస్టాండ్‌లో సత్యనారాయణ కనిపించాడు. అతనిని చూడగానే సత్యనారాయణ పారిపోయేందుకు ప్రయత్నించగా వెంబడించి పట్టుకుని ధైర్యం చెప్పి మంగళగిరి రూరల్ పోలీసులకు అప్పగించారు. దీంతో కానిస్టేబుల్ కుటుంబ సభ్యులతో పాటు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఎస్ఐ వెంకట్, ఇతర సిబ్బంది సత్యనారాయణకు కౌన్సెలింగ్ ఇచ్చి, కుటుంబ సభ్యులకు అప్పగించారు. అవసరాల నిమిత్తం పలుచోట్ల అప్పులు చేయడం, అప్పు ఇచ్చిన వేధించడంతో సత్యన్నారాయణ ఇల్లు వదిలి వెళ్లిపోయినట్లు బంధువులు మొదట అనుకున్నారు.

నివాస ప్రాంతాల్లోనే ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో నివసిస్తున్న వారికి ఉన్నచోటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఎం తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో సీపీఎం నాయకులతో కలసి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా పేదల నివాస ప్రాంతాల్లో రోడ్లు, మురుగు కాల్వలు, అర్హులకు పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. ఆయా ప్రాంతాల సచివాలయాల్లో సోమవారం వినతి పత్రాలు అందజేశారు. సీపీఎం తాడేపల్లి పట్టణ సీనియర్ నాయకులు వేముల దుర్గారావు, వేముల వెంకటేశ్వర్లు, ఇర్ఫాన్, వేణు, శారత, రహంతాబి, సువార్త, శ్యామల పాల్గొన్నారు.

జిల్లా స్థాయి స్పెల్ బీ పోటీలు

మేడికొండూరు: పేరేచర్ల ఆపిల్ పాఠశాలలో జిల్లా స్థాయి స్పెల్ బీ పోటీలు ఎద్వైత్ స్కిల్ హబ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. మంగళగిరికి ఎస్ఎస్ టాలెంట్ పాఠశాల విద్యార్థిని జాహ్నవి మొదటి బహుమతి సాధించింది. గుంటూరు సక్సెస్ స్కూల్ విద్యార్థి శివ కార్తీక్ రెండవ బహుమతి, అచ్చంపేట బ్లూ బెల్స్ పాఠశాల విద్యార్థి మణికంఠ మూడవ బహుమతి సాధించారు. హబ్ సీఈవో మక్కెన అజయ్ కుమార్ బహుమతులు ప్రదానం చేశారు. కరస్పాండెంట్ ఇమ్మడి రవికుమార్, హెచ్ఎం ఎం. అజయ్ కుమార్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ తేజ



సీనియర్ సిటిజన్ ఓటర్లకు సత్కరిస్తున్న తహసీల్దార్ సునీత

తాడేపల్లిరూరల్: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా తాడేపల్లి, దుగ్గిరాల తహసీల్దార్లు సీతారామయ్య, సునీత ఆధ్వర్యంలో శనివారం ఓటు హక్కుపై అవగాహన ర్యాలీలు శనివారం నిర్వహించారు. ఎంటీఎంసీ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, మున్సిపల్, సచివాలయ సిబ్బంది తాడేపల్లి పట్టణంలోని కళ్లం అంజిరెడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ఓటర్లతో, విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్పొరేషన్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేశారు. దుగ్గిరాలలో తహసీల్దార్ కార్యాలయం నుంచి తహసీల్దార్ సునీత ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. దుగ్గిరాల సెంటర్‌లో ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. సీనియర్ సిటిజన్లను సన్మానించారు.

ఫిరంగిపురం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవం శనివారం నిర్వహించారు. తహసీల్దార్ జె.ప్రసాదరావు సిబ్బందితో ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. వేమవరం ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు ముగ్గుల పోటీ నిర్వహించారు. గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సీనియర్ ఓటర్లను శాలువాతో సన్మానించారు. పంచాయతీ కార్యదర్శి శౌరిజోజి, వీఆర్వో షేక్.సుభాని,

ఓటు హక్కుపై చైతన్యం

మంగళగిరి (తాడేపల్లిరూరల్): జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మంగళగిరి నగర పరిధిలోని వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు శనివారం ఓటు హక్కుపై చైతన్యం కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ నాగేశ్వరరావు పాల్గొన్నారు. మంగళగిరి నగరపాలక సంస్థ సిబ్బంది కళాశాలలో ఓటు హక్కు అవగాహనను రంగోలి నిర్వహించి, కల్పించింది.

మంగళగిరి (తాడేపల్లిరూరల్) : జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మంగళగిరిలోని వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ కళాశాల విద్యార్థులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ కె. శకుంతల పాల్గొని, ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. విద్యార్థులు, నగరపాలక సంస్థ, సచివాలయ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల నుంచి మిద్దె సెంటర్ వరకు అవగాహన ర్యాలీ చేపట్టారు. ప్రిన్సిపల్ నాగేశ్వరరావు, అధ్యాపకులు సావిత్రి, అనూష, కల్యాణి సిబ్బంది పాల్గొన్నారు.

మంగళగిరి (తాడేపల్లిరూరల్): మంగళగిరి వీజే డిగ్రీ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. మంగళగిరి ఎన్నికల అధికారి (ఈఆర్ఓ) లక్ష్మి పాల్గొని, ఓటు హక్కుపై అవగాహనకల్పించారు. మంగళగిరి తహసీల్దార్ దినేష్ రాఘవేంద్ర పాల్గొని, మాట్లాడారు. అధ్యాపకులు, విద్యార్థులు ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ నాదెళ్ల శ్రీనివాసరావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ప్రగడ రాజశేఖర్, వైస్ ప్రిన్సిపల్ గంజి లక్ష్మి పాల్గొన్నారు.

తాడేపల్లిరూరల్ : ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి ప్రాణం అని రాష్ట్ర ఎన్నికల ప్రిన్సిపల్ సెక్రటరి కె.ఆర్.బి.హెచ్.ఎన్. చక్రవర్తి అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా వడ్డేశ్వరంలోని కేఎల్‌యూ బీఏ విద్యార్థుల ఆధ్వర్యంలో నూతక్కి గ్రామంలో ఓటు హక్కుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఓటు ప్రాధాన్యతను వివరిస్తూ.. ప్లకార్డులు ప్రదర్శించారు. అత్యధికంగా ఓటు హక్కు వినియోగించుకున్న గ్రామానికి చెందిన 103ఏళ్ల గోగుల శాంతమ్మ, దివ్యాంగుడు బుల్లాదాసును ఘనంగా సత్కరించారు. మంగళగిరి ఎన్నికల నమోదు అధికారి లక్ష్మి, తహసీల్దారు రాఘవేంద్రరావు, బీఏ విభాగాధిపతి డాక్టర్ బి. శివనాగయ్య, ఉప అధిపతి డాక్టర్ కె.అనిల్ కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్‌రాజీవ్ రెడ్డి పాల్గొన్నారు.

తాడికొండ: ఓటు హక్కును వినియోగించుకోవాలని గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ సూచించారు. తుళ్ళూరు మండలం ఐనవోలు వీఐటీ– ఏపీ విశ్వ విద్యాలయంలో జాతీయ ఓటరు దినోత్సవం శనివారం నిర్వహించారు. అవగాహనా సదస్సులో జేసీ పాల్గొన్నారు. వర్సిటీ వీసీ డాక్టర్ ఎస్‌వీ కోటారెడ్డి విద్యార్థులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఎక్కువ సార్లు ఓటు హక్కు వినియోగించుకున్న వృద్ధులను సత్కరించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఈఆర్‌వో ఎం.గంగరాజు, తాడికొండ, తుళ్ళూరు తహసీల్దార్లు సుజాత, కె.నాసరయ్య, రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఖాదిర్ బాషా పాల్గొన్నారు.

మేడికొండూరు : తహసీల్దారు హరిబాబు భీమినేనివారి పాలెంలోని ఉన్న కేసీ రెడ్డి కళాశాలలో శనివారం జరిగిన జాతీయ ఓటర్ల దినోత్సవంలో పాల్గొన్నారు. విద్యార్థులు అవగాహన కల్పించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

తాడికొండ: స్థానిక మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం శనివారం నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె.నాగ శ్రీనివాసరావు అధ్యక్షతన కళాశాల డీన్‌లు డాక్టర్ ఫణికుమార్, డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ వీవీ సుబ్బారావు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జయకృష్ణ, వివిధ శాఖాధిపతులు పాల్గొన్నారు.



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్ ప్రసాదరావు



ఓటు అక్షర రూపంలో విద్యార్థులు



నూతక్కిలో ఓటు హక్కుపై కేఎల్‌యూ విద్యార్థుల ప్రతిజ్ఞ



ఓటర్ల దినోత్సవ ర్యాలీలో ఎంటీఎంసీ డీసీ శ్రీకాంత్, అధికారులు

రహదారి భద్రతపై అవగాహన

మంగళగిరి (తాడేపల్లిరూరల్): తుళ్లూరు మండలం వెంకటపా గ్లోబల్ హైస్కూల్ విద్యార్థులకు రోడ్డు భద్రతపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంగళగిరి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ జాతీయ రోడ్డు భద్రతా మహోత్సవాల సందర్భంగా హెల్మెట్ ధారణ, రాంగ్ రూట్ డ్రైవింగ్, లైసెన్స్ లేకుండా, మద్యం సేవించి వాహనాలు నడుపరాదని విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని తెలిపారు. ట్రాఫిక్ రూల్స్ వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ మన్నవ అప్పాజీ పాల్గొన్నారు.

నేడు మాంసాహార విక్రయాలు నిషేధం

తాడేపల్లిరూరల్ : మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ, దుగ్గిరాల మండల పరిధిలో ఆదివారం మాంస విక్రయాలు నిషేధిస్తున్నట్లు ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా, దుగ్గిరాల తహసీల్దార్ సునీత శనివారం ప్రకటన విడుదల చేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జంతు వధను నిషేధిస్తున్నామని, దానిలో భాగంగా మాంసం దుకాణాలు, ఇతరులు దుకాణాలు తెరవవద్దని పేర్కొన్నారు. హోటళ్లు, రెస్టారెంట్లలో మాంసాహారాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ప్రకటనలో హెచ్చరించారు.